# ధ్రువుడు

*(సునీతి, ఉత్తానపాదులవారి ఏకైక పుత్రుడు ఈ ధ్రువుడు. ఉత్తానపాదునకు సురుచి అను రెండవ భార్య ఉండెడిది. ఆమెకు ఉత్తముడను కుమారుడు కలడు. ధ్రువుడు, ఉత్తముడు ఒకే తల్లి బిడ్డలవలె మెలగెడివారు. ఒకనాడు ధ్రువుడు పెద్దవాడగుటచే, తండ్రియైన ఉత్తానపాదుడు తొడపై కూర్చొనబెట్టుకొనుటకు దగ్గరికి పిలవగా, సవతి తల్లియైన సునీతి, ఆ పిల్లవానిని రెక్కపట్టి క్రిందకి లాగి తండ్రి తొడపై కూర్చొను అధికారము, నా గర్భమున పుట్టినవానికే కలదుగానీ నీకు లేదని చీవాట్లు పెట్టినది, అంతటి అధికారము కావలెనన్న అడవికిపోయి, హరినిగూర్చి తపస్సు చేసి, వరమును పొందిరమ్మని పలుకగా బాలుడైన ధ్రువుడు, పినతల్లి మాటలను విశ్వసించి, తల్లియైన సునీతి యెంత బ్రతిమిలాడిననూ వినక, నచ్చజెప్పి, అరణ్యములకు వెళ్ళి, దీర్ఘ తపస్సు ఆచరించి హరి అనుగ్రహమునకు పాత్రుడైన పవిత్ర బాలుడు, నిర్మల హృదయుడు ఈ ధ్రువుడు. సదా పరిభ్రమించు తారామండలమందు శాశ్వతముగా స్థానము నందుకొనెను.* లేత వయస్సుననే దైవ విశ్వాసముచే, పినతల్లి మాటలను నమ్మి తపస్సు చేసి, నారదుడు ఎన్ని అడ్డు చెప్పిననూ వినక పట్టును సాధించి పరమేశ్వరుని దర్శించిన బాలుడు ధ్రువుడు. కన్న తల్లికి, తండ్రికి కూడను సద్గతిని అందించిన బాలరత్నం ఈ ధ్రువరత్నం.)

ఈ ప్రాకృత ప్రపంచమునకు న్యాయము, ధర్మము మూలాధారములు. వీటిని స్థాపించినవాడు, బోధించినవాడు, ఉపదేశించినవాడు మను చక్రవర్తి. ఇతనికి యిద్దరు పుత్రులు. ఒకడు ఉత్తానపాదుడు. రెండవవాడు ప్రియవ్రతుడు. ఇందులో ఉత్తానపాదునికి సునీతి, సురుచి అని యిద్దరు భార్యలు. సునీతి కుమారుడు ధ్రువుడు. సురుచి కుమారుడు ఉత్తముడు.

ఐదు సంవత్సరములు కలిగిన ధ్రువుడు, నాలుగున్నర సంవత్సరముల వయస్సు కలిగిన ఉత్తముడు యిరువురు తోటలో ఆడుకుంటున్నారు. ఈ ఆడుకునే పిల్లలను చూస్తూ తండ్రి ఒక ఆసనముపై కూర్చొని ఆనందము ననుభవిస్తున్నాడు. ఉన్నట్లుండి ఉత్తముడు అలసిపోయినట్లుగా వచ్చి తండ్రి తొడపై కూర్చున్నాడు. ఈ ఉత్తముడు రెండవ భార్యయైన సురుచి కుమారుడు. ఉత్తానపాదునకు సురుచి అనిన చాలా యిష్టము. సునీతి కుమారుడు ధ్రువుడు కూడా ఉత్తముని అనుసరిస్తూ పరుగెత్తి తండ్రి తొడపై కూర్చోటానికి ప్రయత్నించాడు. ఈ దృశ్యమును చూచిన సురుచి పరుగెత్తుకొని వచ్చి లేతహృదయుడైన ధ్రువుని చేయి పట్టి లాగి దూరంగా నెట్టింది. 'ధ్రువా! నీవు ఉత్తానపాదుని కుమారుడవేగానీ, సురుచి కుమారుడవు కాదు. నా గర్భమునందు జన్మించినవానికే తండ్రి తొడపైన కూర్చొనుటకు అధికారమున్నది. కనుక, నా గర్భములో పుట్టినప్పుడే నీకీ ప్రాప్తి లభిస్తుంది. కానీ, నీవు ఆ సునీతి గర్భంలో పుట్టటం వల్లనే నీ కర్మ యిలా అనుభవింపజేస్తున్నది' అని అంటూ అమితమైన కఠిన వాక్కులచేత ధ్రువుని హృదయాన్ని గాయపరచింది.

**అంతా మన మంచికే**

ఆ పిల్లవాడు మారు మాట్లాడక తల్లి దగ్గరకు తిరిగి వచ్చాడు. కానీ, తల్లితో యేమీ చెప్పలేదు. ఒకచోట కూర్చొని కన్నీటి ధారలు కార్చుతూ చాలా విచారిస్తున్నాడు. తల్లి యెంత అడిగినా ధ్రువుడు యేమీ చెప్పలేదు. జరిగిన విషయాన్ని దాసీల ద్వారా తెలుసుకొని సునీతి కూడా కన్నీటి ధారలు కార్చుతూ, 'నాయనా! ఈ అభాగ్యురాలి గర్భమున పుట్టటం చేత నీవు యీవిధమైన శిక్షను అనుభవించవలసి వచ్చింది. నీ పినతల్లి చెప్పినట్లుగా, నీవు భగవంతుని ప్రార్థించి తిరిగి ఆమె గర్భమునందు పుట్టి నీ మనోభీష్టము నెరవేర్చుకో' అని యెంతో ఓదార్చింది. ఈ మాటలు విన్నంతనే ధ్రువుడు నోరు విప్పి, ' ఈ అవమానం జరగటం చేత నాకు జీవితంపై యేమాత్రము ఆశ లేదు' అన్నాడు. తన పినతల్లిని అనేక విధములుగా తూలనాడుతూ వచ్చాడు. వెంటనే అతని తల్లి నోరు మూసింది. 'కుమారా! పరులను నిందించకూడదు. ఎవరిని మనం దూషించినా దాని ఫలితము

మనకే లభిస్తుంది. సురుచి ఆడిన మాటలన్నీ నీ భవిష్యత్తుకు మంచివిగా ఉంటాయి. ఎవరేమి చెప్పినా అది మన మంచికోసమేనని భావించాలి. కనుక, పరులను విమర్శించ వద్దు. నీ పినతల్లిని యేమాత్రము దూషించ వద్దు' అని బోధించింది. ఇలా యేతల్లి అయినా చెబుతుందా? ఆమె పేరు సునీతి. నీతిగల వ్యక్తి. అందువల్లనే, కుమారునికి చక్కని నీతిని బోధిస్తూ వచ్చింది.

**దేవుడే దిక్కు**

'అయితే, నన్ను యిప్పుడు యేమి చేయమంటావు?' అడిగాడు ధ్రువుడు. 'నాయనా! ఒక్క భగవంతుడే నీకు దిక్కు. భగవంతుడే నీ అభీష్టమును నెరవేరుస్తాడు. కనుక, నీవు నారాయణుని ఆశ్రయించి నీ అభీష్టమును నెరవేర్చుకొని రమ్ము. వెళ్లు అరణ్యమునకు' అన్నది. ఐదు సంవత్సరముల పిల్లవానిని కారడవులకు పంపే తల్లులుంటారా ఈనాడు? ధ్రువుని మస్తకముపైన తల్లితన హస్తము ఉంచింది.

*అడవులందునున్న ఆకసముననున్న*
*పట్టణమున నున్న పల్లెనున్న*
*గుట్టమీద నున్న నట్టేటనున్నను*
*దిక్కులేని వానికి దిక్కు హరియే!*

వెళ్ళు, నాయనా! ఈ భవనంలో ఉంటూ ఈ అవస్థలకు గురి అయ్యేదానికంటే వనములో ఉండి దైవమును చింతించు. నీవు ఎక్కడ ఉన్నా నేను సహాయం చేసే స్థితిలో లేను. ఇక్కడ ఉండినా, అక్కడ ఉండినా, ఎక్కడ ఉండినా దిక్కులేనివానిని దేవుడే చూసుకుంటాడు. కనుక, అది అడవి అని భావించ వద్దు. భగవంతుని నిలయమని భావించు' అని చెప్పి ఆశీర్వదించింది. ధ్రువుడు తల్లి ఆజ్ఞను శిరసావహించి, తల్లి పాదములనంటి నమస్కరించి అడవికి బయలుదేరాడు. ఐదు సంవత్సరముల పిల్లవాడు. అరణ్యమంటే ఏమిటో, అరణ్యమునకు దారి ఎటో, ఎట్లా పోవాలో , ఎట్లా ప్రార్థించాలో ఏమీ తెలియని అమాయకుడు. తానేమీ విచారణ చేయలేదు. తల్లి ఆజ్ఞను శిరసావహించాలి. దైవాన్ని ప్రార్థించి సాక్షాత్కరింపజేసుకోవాలి. దైవానుగ్రహాన్ని పొందాలి. ఈ లక్ష్యము తప్ప ఆ పిల్లవాని హృదయంలో మరొక భావమే లేదు. మరొక తలంపే లేదు.

**నారదోపదేశం**

తల్లి ఆశీర్వాద బలంతో వెళ్ళాడు ధ్రువుడు. దారికి అడ్డు వచ్చాడు నారదుడు. తన దివ్యదృష్టితో ధ్రువుని సంకల్పమును గుర్తించాడు. 'ధ్రువా! ఎక్కడికి వెడుతున్నావు? ఆడుకోటానికా?' అని అడిగాడు. 'అవును, నారదా! నేను దైవంతో ఆడుకోటానికి వెడుతున్నాను' అన్నాడు ధ్రువుడు. 'ఎక్కడున్నాడు దైవము?' అని ప్రశ్నించాడు నారదుడు. 'అరణ్యానికి వెళ్ళి నారాయణుని చింతించమని మా తల్లి చెప్పింది' అన్నాడు ధ్రువుడు. 'పిచ్చివాడా! సర్వసంగ పరిత్యాగులై అనేక సంవత్సరాలు తపస్సు లాచరించి సమస్త శాస్త్రేతిహాసపురాణములను గుర్తించిన మహనీయులకే దైవసాక్షాత్కారం అంత సులభం కాకపోయింది. నీవు చిన్నవాడవు, దైవమంటే యేమిటో తెలియదు. ఇలాంటి నీవు దైవాన్ని సాక్షాత్కరింపజేసుకోటం అసాధ్యం' అన్నాడు నారదుడు. 'వయస్సు ప్రధానం కాదు నారదా! నా తల్లి ఆజ్ఞ, నా సత్సంకల్పము రెండూ తోడై భగవత్సాక్షాత్కారానికి తప్పక అవకాశం కలుగుతుంది' అన్నాడు ధ్రువుడు.

నారదుడు ఆ పిల్లవానిని వెనుకకు పంపాలని అనేకవిధాలుగా ప్రయత్నంచేశాడు. నారదుడు, 'అరణ్యంలో క్రూరమృగములుంటాయి. అనేక భయంకర సర్పములు తిరుగాడుతుంటాయి. భూతప్రేతపిశాచములు నిన్ను వెంటాడుతుంటాయి. రాజభవనంలో పెరిగిన నీవు ఈ కష్టములను భరించలేవు' అని ఎన్నోవిధములుగా భయపెట్టాడు. కాని, ధ్రువుని దృఢసంకల్పాన్ని ఏ మాత్రమూ మార్చలేకపోయాడు. చివరికి దయ కలిగి, 'నాయనా! నీ హృదయ పవిత్రత, నీ సత్సంకల్పము యొక్క దృఢత్వము నా మనస్సునెంతో మార్చినవి. నేనుకూడా

నీతో కొంతదూరం వస్తాను' అని నారదుడు యమునాతీరం వరకు వచ్చి అక్కడ ధ్రువుని చేత స్నానం గావింపజేసాడు. 'నాయనా! చిత్తశుద్ధితో నామచింతన చేసినప్పుడు నారాయణుడు తప్పక సాక్షాత్కరిస్తాడు' అని బోధించి నామయుక్తమైన ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు. ఏమిటది? 'ఓం నమో భగవతే వాసుదేవాయ'. ఈమంత్రాన్ని అతని చెవిలో చెప్పి నారదుడు వెళ్లిపోయాడు.

**కఠోర తపం**

ధ్రువుడు మధువనంలో ప్రవేశించాడు. చల్లని ఛాయగా ఉన్న ప్రదేశంలో దీక్షను ప్రారంభించాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని ఉచ్చరిస్తూ కూర్చున్నాడు. దేహాన్ని మరచిపోయాడు. కాని, అప్పుడప్పుడు ఆకలివేయటం, దాహము వేయటం అడ్డుతగులుతూ వచ్చాయి. ఒకనెల ఆ మధువనంలో క్రింద పడిన ఫలములను భుజించి కాలము గడిపాడు. రెండవ నెల లేతాకులు, చెట్లవేర్లు తిని బ్రతుకుతూ వచ్చాడు. మూడవ నెల కేవలం నీరు మాత్రమే త్రాగి జీవిస్తూ వచ్చాడు. నాల్గవ నెల కేవలం గాలి మాత్రమే తీసుకొని బ్రతుకుతూ వచ్చాడు. శరీరము అస్థిపంజరమైంది. అది దేహానికి సహజము. ఎందుకనగా, దేహము ఆహారముతో పుట్టినది. అన్నగతమైనది. అందుకే ఈదేహమును అన్నమయ కోశమన్నారు. తరువాత ప్రాణమయ కోశము, తరువాత మనోమయ కోశము, తరువాత విజ్ఞానమయ కోశము, తరువాత ఆనందమయ కోశము. ధ్రువుడు అన్నమయ కోశాన్ని అలక్ష్యం చేశాడు. ప్రాణమయ కోశముతో బాటునామాన్ని చేర్చాడు. ఉచ్ఛ్వాసనిశ్వాసములతో, 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని చేర్చాడు. తరువాత మనోమయ కోశములో భగవంతుని రూపాన్ని చిత్రించుకొని నామాన్ని స్మరిస్తూ వస్తున్నాడు. అనగా ఏమిటి? రూపసహిత జపము, జపసహిత రూపము. రూపనామజపముచేత తపస్సు ఆచరిస్తూ వచ్చాడు. రూపాన్ని చిత్రించుకున్నాడు. నామాన్ని స్మరిస్తున్నాడు. అదే తపముగా మారిపోయింది. ఈ తపస్సు వలన అడవి అంతా దద్దరిల్లి పోతున్నది. ఋషులు, మునులు ఈ వేడికి తాళలేకపోయారు. ఇంత చిన్న పిల్లవాడు ఇంత కఠినమైన తపస్సు ఆచరిస్తున్నాడే అని ఆశ్చర్యపడ్డారు. కాని, ఈ తపస్సుకు భంగము కలిగించాలని పాములను, భూతములను సృష్టించారు. క్రూరమృగములను పంపించారు. విషసర్పములు శరీరమంతా సంచరిస్తున్నాయి. ధ్రువుడు యేమాత్రము చలించలేదు. కన్నులే తెరవలేదు.

**ఏం కావాలి?**

అన్నింటినీ మరచి, 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అంటున్నాడు. కడపటికి నాదముకూడా లోపలినుండి రాలేకపోయింది, మైమరచి ఉన్నాడు. అప్పుడు నారాయణుడు దగ్గరకు సమీపించాడు. ఎంత సమీపానికి వస్తున్నాడో ధ్రువునిలో అంత తేజస్సు ఉట్టి పడుతున్నది. ఉన్నట్లుండి ఒక్కతూరి కన్నులు తెరిచాడు. చూసేటప్పటికి సాక్షాత్ నారాయణమూర్తి ఎదురుగా ఉన్నాడు. 'నారాయణా! ఇంతకాలం నాలో దాగుకొని ఉండి ఇప్పుడు నాకు కనిపిస్తున్నావా!' అని, భక్తిపారవశ్యంతో అనేకవిధాలుగా స్తుతించాడు. నారాయణునికే ఆశ్చర్యం కలిగింది. ఈ లేతవయస్సులో యిట్టి నిత్యమైన, సత్యమైన, పవిత్రమైన జ్ఞానం ఈ బాలునియందు చేరటం ఎంత ఆశ్చర్యకరం! పూర్వజన్మలో చేసిన యోగము వలన దాని శేషమును యిప్పుడు అనుభవిస్తున్నాడని తనలోతాను అనుకొని, 'ధ్రువా! నీకేమి కావాలి?' అని అడిగాడు. కాని, ధ్రువుని నోటినుండి మాట రాలేదు. రెప్ప వాల్చకుండా నారాయణుని చూస్తున్నాడు. తెలియకుండా పాదములను గట్టిగా పట్టుకున్నాడు. నారాయణుడు తన శంఖము తీసి అతని లేతబుగ్గలపై అటుయిటు తిప్పాడు. ఎప్పుడైతే ఈ శంఖము అతని బుగ్గలను తాకిందో తక్షణమే అతనిలో జీవశక్తి ఆవిర్భవించింది. లేవలేని ధ్రువుడు లేచాడు. ఏమి కావాలని అడుగుతున్నాడు నారాయణుడు. 'నారాయణా! ఇంకా నన్ను మాయలో ముంచుతున్నావా? నేనెక్కడున్నానో, యేమిచేస్తున్నానో, ఎవరిని ప్రార్థిస్తున్నానో తెలిసేకదా నీవు వచ్చావు. అన్నీ తెలిసిన వానికి నాకేమి కావాలో తెలియదా? అదికూడా నీకే తెలుసు' అన్నాడు. 'బాలకా! నీవు దృఢసంకల్పంతో అడవిలోకి వచ్చావు. తపస్సు నాచరించావు. కానీ, నీ వాక్కు

ఏవిధంగా వస్తుందో నేను చూడాలి. నీ పలుకులను కూడా నేను వినాలి' అన్నాడు నారాయణుడు. అనగా, భగవంతుడు ఏమి చూస్తున్నాడనేది యిక్కడ చక్కగా గుర్తించాలి. 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. మనస్సు, వాక్కు, కాయము యీమూడింటి యేకత్వము కలిగినప్పుడే అభీష్టము నెరవేరుతుంది. 'నీవొకటి సంకల్పించుకున్నావు. సంకల్పానికి తగినట్లుగా ఆచరించావు. ఇంక ఆచరణకు తగినట్లుగా యేమి కోరతావో కోరుకో' అన్నాడు. 'స్వామీ! నా పినతల్లి చేసిన అవమానమునకు బాధతో నేను తిరిగి నా తండ్రి తొడపై కూర్చోవాలని సంకల్పించుకున్నాను. ఆ ప్రాప్తి నాకు లభించాలని తపస్సునాచరించాను. కానీ యిప్పుడు నాకేదీ అక్కరలేదు. ఏదో నీటిబిందువు కోసం వెతుకుతూ వచ్చాను. నీవు అమృతకలశమే నాకు అందించావు. గాజుముక్కకై వెతుకుతూ వచ్చాను. నీవు మాణిక్యమే నాకు అందించావు. కనుక, నాకు యితర వాంఛలు యేమీ లేవు' అన్నాడు. అప్పుడు నారాయణుడు నవ్వి, 'నాయనా! నీ సంకల్పము, పని రెండూ ఒకటయ్యాయి. కానీ, మాట మాత్రం మరొటి అయింది. దానినే నీవు అనుభవించాలి. కనుక, నీవు తిరిగి వెళ్ళి నీ తండ్రి తొడపై కూర్చొని, తల్లికి ఆనందమిచ్చి రాజ్యము పాలించి రా' అన్నాడు.

**నామమహిమను చాటు**

చూసారా! దైవనిర్ణయాలు, దైవసంకల్పాలు, దైవంయొక్క అభీష్టాలు యింత రహస్యంగా ఉంటాయి. ధ్రువుడు తీవ్రమైన తపస్సు ఆచరించాడు. కానీ మనస్సు, క్రియలతో అతని వాక్కు యేకం కాలేదు. ఇంత చిన్నదాంట్లో ఓడిపోయాడు ధ్రువుడు. ఇంక సర్వమూ నీకే అర్పితమని నారాయణునికి వదలి పెట్టాడు. అప్పుడు నారాయణుడు చెప్పాడు, 'నాయనా! నా మాటను శిరసావహించు. తల్లి మాటను నీవు శిరసావహించావు. ఇప్పుడు భగవంతుడే నీకు తల్లి, తండ్రి, సర్వమూ. నీ వాక్యమును నీవు నెరవేర్చుకునే నిమిత్తమే నిన్ను పంపుతున్నాను. మారు మాటాడక నీవు వెళ్ళవలసిందే' అన్నాడు. 'సరే, భగవదాజ్ఞను శిరసావహిస్తాను. దేనినైనా ఆచరిస్తాను' అన్నాడు ధ్రువుడు. ఈ వాగ్దానం యిచ్చిన తరువాత నారాయణుడు అతనిని దగ్గరకు చేర్చుకున్నాడు. 'ధ్రువా! నీవు ఈ లోకమునకు చాటవలసింది ఎంతో ఉన్నది. దైవనామ మహిమను నీవు లోకానికి చాటాలి. ఇదిగో నేను నీలో ప్రవేశిస్తున్నాను' అన్నాడు. నారాయణునినుండి ఒక జ్యోతి వెళ్ళి ధ్రువునిలో చేరిపోయింది. ఇంతకాలం బలహీనంగా ఉన్న ధ్రువునియందు అమితమైన శక్తి ఆవిర్భవించింది. నమస్కారం చేసాడు. నారాయణుడు అంతర్ధానమైనాడు. అశరీరవాణిగా ధ్రువునితో, 'ధ్రువా! నీవు అనేక సంవత్సరములు చక్రవర్తిగా పరిపాలన సల్పాలి. నీ తండ్రి యిప్పుడు చాలా పశ్చాత్తాప పడుతున్నాడు. అన్నపానాదులను వదలి నీ రాకకై నిరీక్షిస్తున్నాడు. వెళ్ళి రాజ్యపాలన గావించు. తరువాత నీవు ఉన్నతమైన స్థానం చేరుకుంటావు. సప్తఋషుల మధ్య, సూర్యచంద్రాదుల మధ్య అందరూ నీకు ప్రదక్షిణ చేసేటట్లు ధ్రువ నక్షత్రముగా నీకు స్థానమునందించాను. నీవు అమృతస్వరూపునిగా, ఆనందస్వరూపునిగా జీవిస్తావు' అన్నాడు.

**ధ్రువునికి స్వాగతం**

ధ్రువుడు అరణ్యమునుండి బయలుదేరాడు. ధ్రువుడు వస్తున్నాడనే వార్త ఉత్తానపాదునికి తెలిసింది. అత్యంత ఆనందంతో సునీతిని, సురుచిని, ఉత్తముని వెంటబెట్టుకొని ధ్రువుని స్వాగతించటానికి వెడుతున్నాడు. తేజోవంతుడైన ధ్రువుడు అడవి దారులలో నడచి వస్తుంటే ఏదో ఒక పెద్ద నక్షత్రం నడచి వచ్చినట్లుగా కనిపిస్తున్నాది. ఆ పిల్లవాని తేజస్సు కళ్ళకు మిరిమిట్లు గొల్పుతున్నది. ఐదున్నర సంవత్సరముల పిల్లవాడు చిరునవ్వులు చిందిస్తూ వస్తున్నాడు. తండ్రి ఒక్కతూరి రథమునుండి దూకాడు. 'నాయనా! ధ్రువా!' అని వెళ్ళి కౌగలించుకున్నాడు. ఎత్తుకొని వచ్చాడు. 'నా పాపమును క్షమించు. నీవు సాక్షాత్ నారాయణమూర్తివే. కాని, నేను వ్యామోహములోపడి నిన్ను అవమాన పరిచాను. నీ తల్లిని బాధించాను' అని పశ్చాత్తాప పడుతూ క్షమించమని కోరాడు. కుమారుడు చెబుతున్నాడు, 'నేనెవరు? నీవెవరు? నీవు తండ్రివి కాదు. నేను కుమారుణ్ణి కాదు.

ఇరువురమూ భగవత్స్వరూపులమే. నీవూ నారాయణుడవే. నేనూ నారాయణుడనే' అని తండ్రికి కూడా జ్ఞానబోధ చేసాడు. 'నాయనా! ఇక నీవు నీ అభీష్టమును నెరవేర్చుకో' అని ఒక తొడపై ధ్రువుని, ఇంకొక తొడపై ఉత్తముని కూర్చోబెట్టుకొని ఉత్తానపాదుడు ఆనందంగా నగరం చేరాడు. ఈ దృశ్యము చూసి సునీతి చాలా ఆనందించింది. ఇంతకు పూర్వం భర్తకూ దూరమైంది, కుమారుడూ యింటిలో లేడు. చాలా బాధపడుతూ వచ్చింది. 'పతిసుతులకు దూరమైన పడతి బ్రతుకదేల? ఏ పాపఫలంబు నాకు ఈ తాపము కలుగజేసె' అని నిరుత్సాహంతో, నిస్పృహతో క్రుంగిపోయిన సునీతి ఈనాడు ఆనందంతో ఉప్పొంగి పోతున్నది. కుమారుని ఎత్తుకొని ముద్దాడింది.

**బాలచక్రవర్తి**

ఈ ధ్రువునికి పట్టాభిషేకం ఎప్పుడు జరిగింది? ఎక్కువ వయస్సు లేదు. భగవంతుణ్ణి సాధించిన ధ్రువుడు లోకపాలనలో కూడా చాలా సులభంగా విజయం సాధించగలడని ఉత్తానపాదుడు గుర్తించి ఆరవ సంవత్సరమునందే అతనికి పట్టాభిషేకం చేసాడు. తమ్ముడు ఉత్తముడు గొడుగు పట్టాడు. తల్లిదండ్రులు చెరొకవైపునా కూర్చున్నారు. 'నాయనా! ఇక పరిపాలనా బాధ్యత నీవు వహించు. మేము అడవికి వెళ్ళిపోతాము' అన్నాడు. లేతహృదయుడైన ధ్రువుడే భగవత్ సాక్షాత్కారం గావించుకున్నప్పుడు మేము మాత్రం కాలం ఎందుకు వ్యర్థం చేసుకోవాలి అనుకున్నారు. మానవ జీవితం దైవ నిమిత్తమై వచ్చినదిగానీ, విలాసముల నిమిత్తం, భోగభాగ్యముల నిమిత్తం కాదని ఆనాడు గుర్తించాడు ఉత్తానపాదుడు. మనువునుండి పుట్టినవాడు మనుజుడు. కనుక, మనుజులందరూ మనువుయొక్క దివ్యభావములను పొందాలి. మనువు ధర్మశాస్త్రమును వ్రాసినవాడు. న్యాయమును బోధించినవాడు. కనుక, న్యాయ ధర్మములను అనుసరించటమే మనుజుని ప్రధాన కర్తవ్యమని నిర్ణయించారు. తల్లిదండ్రులు ఆనాడే తమ రాజ్యమును వదలి తపోవనమునకు వెళ్ళారు. అక్కడ భగవత్ చింతనలో కాలం గడుపుతూ వచ్చారు.

**దేవుని పిలుపు**

ధ్రువుడు ప్రజారంజకంగా రాజ్యమును పాలించి ప్రజల మన్ననలను అందుకొని ప్రజల ఆనందమును రుచిచూసాడు. కడపటికి భగవంతుని పిలుపుకై క్షణక్షణమూ కాచుకొని ఉంటున్నాడు. తిరిగి నా దగ్గరకు వస్తావని భగవంతుడు ధ్రువునితో చెప్పాడు కదా! ఒకనాడు ఒక రథము వచ్చి ఆగింది. అది భగవంతుడు పంపిన రథము అన్నారు. ఎక్కడికి పోవాలి? ఎక్కడికీ పోనక్కరలేదు. సర్వత్ర ఉన్న భగవంతునికై ఎక్కడికి పోవాలి? ఎక్కడికి రావాలి? భగవంతుడే రథమును పంపాడని చెప్పినప్పటికీ ఆ రథమును తెచ్చినవానికి కూడా జ్ఞానబోధ చేశాడు ధ్రువుడు. 'నేను రథములో కూర్చొని పోవటం ఎక్కడో ప్రత్యేకంగా ఉన్న దైవం దగ్గరకని భావిస్తున్నారు. మీరు పిచ్చివారు. భగవంతుడు యిక్కడకూడా ఉన్నాడు' అంటూ కూర్చున్న చోటే 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని స్మరించాడు. వాసుదేవుని నుండి వచ్చిన జ్యోతి తిరిగి నారాయణునిలో చేరిపోయింది.